
సాక్షి
చిత్తూరు
ఆదివారం । 26 । మార్చి । 2023




## ముక్కంటి సేవలో హైకోర్టు జస్టిస్

శ్రీకాళహస్తి: ముక్కంటిని శనివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ దర్శించుకున్నారు. ఆలయ పండితులు ఆశీర్వదించారు.



## శనేశ్వరునికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: ముక్కంటి ఆలయంలోని శనేశ్వర స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తైలంతో విశేష అభిషేకం జరిపించారు.



## వరసిద్ధుని సేవలో తెలంగాణ జస్టిస్

కాణిపాకం(యాదమరి): వరసిద్ధి వినాయక స్వామిని శనివారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవీదేవి దర్శించుకున్నారు.



## రంజాన్ వేళలు

| | ఇఫ్తార్ ఆదివారం (సా) | సహర్ సోమవారం (ఉ) |
|---|---|---|
| తిరుపతి | 6.27 | 4.53 |
| చిత్తూరు | 6.29 | 4.53 |
| పుంగనూరు | 6.31 | 4.56 |

## న్యూస్‌రీల్

### ఆస్పత్రుల్లో ఖాళీలపై నివేదికలు

చిత్తూరు రూరల్: జిల్లా వైద్య విధాన పరిషత్‌లోని ఖాళీలపై ఆశాఖ రాష్ట్ర కమిషనర్‌కు నివేదికలు వెళ్లాయి. ఖాళీ పోస్టుల వివరాలు పంపాలని కమిషనర్ రెండు రోజుల కిందట ఆదేశించారు. ఈ మేరకు జిల్లా అధికారులు కేటగిరిల వారీగా వివరాలను శనివారం రాష్ట్ర శాఖకు నివేదికలు పంపారు. ఇందులో డాక్టర్ పోస్టులు 64, నర్సింగ్ 28, పారా మెడికల్ పోస్టులు 26, అడ్మినిస్ట్రేషన్ 20, క్లాస్–4 పోస్టులు 31 కలిపి మొత్తం 187 పోస్టులకు ఖాళీలున్నాయని అధికారులు నివేదికలిచ్చారు.

### వాహన పన్నులు 75 శాతం వసూలు

చిత్తూరు రూరల్: జిల్లా వ్యాప్తంగా వాహన పన్నుల సంబంధించి 75శాతం లక్ష్యం పూర్తయింది. పన్ను చెల్లించని వాహనాలపై డీటీసీ అధికారులు దృష్టి పెట్టారు. గత నెల నుంచి వివిధ వాహనాల త్రైమాసిక పన్ను వసూళ్లపై యజమానులకు నోటీసులు జారీ చేశారు. నెలాఖరు లోపు పన్ను వంద శాతం పూర్తి చేసేలా పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు 75 శాతం పూర్తి చేసి లక్ష్యానికి చేరువయ్యారు.

### మాజీ సైనికులకు గుర్తింపు కార్డులు

పుంగనూరు: పట్టణంలోని సైనిక్ భవనంలో శనివారం మాజీ సైనికులకు జిల్లా సైనిక సంక్షేమాధికారి ఆర్.విజయశంకర్‌రెడ్డి గుర్తింపుకార్డులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చిత్తూరుకు రాకుండా ఎక్కడికక్కడ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి సమస్య ఎదురైనా మొబైల్ నంబరు ద్వారా తెలియజేస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ఇళ్ల పట్టాల పంపిణీ విషయమై ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు ఆయన తెలిపారు. సంఘం నాయకులు కృష్ణప్ప, నానబాల మణి, శ్రీనివాసులు, మధుసూదన్‌రెడ్డి, నానబాలగణేష్, వినాయకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 1 నుంచి మజ్జిగ, ప్రసాదం



మాట్లాడుతున్న చైర్మన్ మోహన్ రెడ్డి, పక్కన ఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో వేస విని దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఉచితంగా మజ్జిగ, తాగునీరు, ప్రసాదం అందించాలని పాలక మండలి నిర్ణయించినట్లు దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు వెల్లడించారు. శనివారం పాలకమండలి సమావేశం జరిగింది. సమావేశంలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై, వేసవిలో భక్తులకు కల్పించాల్సి సౌకర్యాలపై చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతు గత వారం విజయవాడలో దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ వద్ద ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు, ప్రిన్సిపల్ సెక్రటరీలతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించామన్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆమోదించామన్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగానే రోజూ నిత్య అన్నదానంలో 8 వేల మందికి అన్నదానం చేసేలా నూతన భవనం పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. పంచాయతీ టోల్‌గేట్ నుంచి 80 శాతం నిధులు దేవస్థానానికి వచ్చేలా నిర్ణయించినటు తెలిపారు. ఆలయంలో అన్ని విభాగాల్లో సిబ్బందిని నియమించాలని దేవదాయశాఖ అధికారులను కోరినట్లు తెలిపారు. సభ్యులు నరసింహులు శెట్టి, ఎక్స్ అఫిషియో సభ్యులు సోమశేఖర్ గురుకుల్, ఏఈఓలు విద్యాసాగర్ రెడ్డి, హేమమాలిని, హరిప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

# ఆరోగ్యమస్తు



నిరుపేదలకు సైతం నాణ్యమైన వైద్యం అందించాలి.. నగదు రహితంగా ప్రజలకు చికిత్సలందించాలి.. ప్రభుత్వాస్పత్రులను ఆధునిక దేవాలయాలు తీర్చిదిద్దాలి.. అత్యున్నత సేవలు అందుబాటులోకి తీసుకురావాలి.. ఇదే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మకమైన సంస్కరణలు తీసుకువచ్చారు. ఒకప్పుడు వసతులలేమితో కునారిల్లుతున్న సర్కారు దవాఖానాలకు కార్పొరేట్ హంగులు సమకూర్చారు. సిబ్బంది కొరతతో కొట్టుమిట్టాడుతున్న వైద్యశాలలను నిపుణులతో భర్తీ చేశారు. నాడు గవర్నమెంట్ హాస్పిటల్‌కి రావాలంటేనే భయపడిన ప్రజలే.. నేడు ధైర్యంగా బారులు తీరే స్థాయికి తీసుకువచ్చారు. సకల సౌకర్యాలు.. అత్యాధుని పరికరాలు.. అండగా నిలిచే డాక్టర్లు.. అవసరాలకు అనుగుణంగా మందులు.. ఆదరంగా చూసే సిబ్బందితో ప్రభుత్వాస్పత్రులను ఉన్నతంగా తీర్చిదిద్దారు.

- ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన చికిత్సలు
- వైద్యం కోసం బారులు తీరుతున్న ప్రజలు
- ఉత్తమ సేవలకు గుర్తింపుగా ర్యాంకులు
- రాష్ట్రస్థాయిలో ఉమ్మడి జిల్లాకు 11 ఏ, 10 బీ గ్రేడ్‌లు



తిరుపతికి చెందిన ఓ గర్భిణికి ఏడో నెలలోనే పురిటి నొప్పులు మొదలయ్యాయి. కుటుంబీకులు ఆమెను ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆపరేషన్ చేయగా ముగ్గురు ఆడపిల్లలకు జన్మనిచ్చింది. అందులో ఒక పాప ఆరోగ్యంగా ఉంటే, మిగిలిన ఇద్దరు ఫిట్స్‌తో బాధపడుతూ పాలు కూడా తీసుకోలేని దుస్థితిలో ఉన్నారు. ఐసీయూలో 26 రోజుల పాటు వైద్యం అందించాల్సి వచ్చింది. అందుకు రూ.10 లక్షలు వెచ్చించారు. తర్వాత స్తోమత చాలక మరో వైద్యుడి సూచన మేరకు పలమనేరులోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆశ్రయించారు. న్యూబార్న్ స్టెబిలైజేషన్ యూనిట్లో 10రోజుల పాటు మెరుగైన వైద్యం అందించారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పిల్లలను ఆరోగ్యవంతులుగా చేసి పంపించారు.



గంగధార నెల్లూరు మండలం ఆవలకొండ గ్రామానికి చెందిన ముబారక్ అలీ(45)కు కడుపులోని పేగులు కుళ్లిపోయాయి. దీంతో తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతూ జనవరిలో చిత్తూరు జిల్లా ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యాడు. అక్కడ డాక్టర్లు అన్ని రకాల పరీక్షలు చేసి అతనికి 10 రోజులు పాటు పర్యవేక్షణలో ఉంచారు. ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా ఆపరేషన్ చేసి సురక్షితంగా ఇంటికి పంపారు. ముబారక్ అలీ ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నాడని కుటుంబ సభ్యులు సంతోషంగా చెబుతున్నారు.

### ఉమ్మడి చిత్తూరు జిల్లా సమాచారం

| | |
|---|---|
| జిల్లా ఆస్పత్రులు | 02 |
| ప్రాంతీయ వైద్యశాలలు | 05 |
| సామాజిక ఆరోగ్య కేంద్రాలు | 17 |
| మొత్తం పడకలు | 1600 |

### 2022 ఏప్రిల్ నుంచి 2023 ఫిబ్రవరి వరకు

| | |
|---|---|
| ఓపీలు | 32,56,439 |
| ఐపీ | 3,18,056 |
| మేజర్ ఆపరేషన్లు | 8,014 |
| ట్యూబెక్టమీలు | 6,605 |
| డెలివరీలు | 15,283 |
| ఎక్స్‌రేలు | 1,20,431 |
| యూఎస్‌జీలు | 84,588 |
| ఈసీజీ | 1,04,220 |
| ల్యాబ్ టెస్ట్‌లు | 29,33,755 |



చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి

సాక్షి, తిరుపతి/చిత్తూరు రూరల్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వైద్య విధాన పరిషత్ కింద మొత్తం 24 ఆస్పత్రులు ఉన్నాయి. ప్రధాన, ప్రాంతీయ, సామాజిక ఆరోగ్య కేంద్రాలు 24 గంటలు పనిచేస్తున్నాయి. వీటన్నింటిలో అనేక సౌకర్యాలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. వైద్యులు, సిబ్బంది నియామకంతో పాటు అవసరమైన మందులను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటోంది.



ఓపీ కోసం క్యూలో వేచి ఉన్న రోగులు (ఫైల్)



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు (ఫైల్)

**కార్పొరేట్‌కు దీటుగా..**

ప్రభుత్వం తొలుత వైద్య పరికరాల సమకూర్చడంతో పాటు జిల్లా ఆస్పత్రి నుంచి ఏరియా, సామాజిక ఆరోగ్య కేంద్రానికి సైతం వసతుల కల్పనతో పాటు సివిల్ సర్జన్‌లను కేటాయించింది. అలాగే పలు రకాల పోస్టుల భర్తీతో పాటు వివిధ రకాల పరీక్ష పరికరాలను అందజేసింది. ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా వైద్యసేవలు అందిస్తోంది. ఆపరేషన్లు చేయిస్తోంది. దీంతో వైద్యవిధాన పరిషత్ పరిధిలో నడిచే ఆస్పత్రులకు ప్రజల తాకిడి పెరిగింది. వైద్య సేవల కోసం రోజుకు వేలాది మంది ప్రభుత్వాస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. వీరికి అన్ని రకాల వైద్య పరీక్షలను చేసి మెరుగైన వైద్యం అందేలా ఆస్పత్రి అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. అలాగే వైద్యులకు ఫేషియల్ అటెండెన్స్‌ను విధిగా అమలు చేస్తున్నారు. దీంతో డాక్టర్ల ప్రైవేటు కార్యకలాపాలకు చెక్ పడింది. పనివేళ్లలో మార్పులు మొదలయ్యాయి. ఫలితంగా ప్రభుత్వాస్పత్రుల్లో సత్ఫలితాలు కనిపిస్తున్నాయి.

**నిరంతరం పర్యవేక్షణ**

ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యసేవలను జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రతి వారం ఆస్పత్రి వారీగా ఓపీలు, ఆపరేషన్లు, డెలివరీలు, టెస్టులపై ఆరా తీస్తున్నారు. ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేసిన కేసుల వివరాలను విచారిస్తున్నారు. సేవల్లో ఎలాంటి లోపాలున్నా వెంటనే సరిచూసుకునేలా సలహాలు అందిస్తున్నారు. ప్రతి నెలా ఏపీవీవీపీ కమిషనర్ రివ్యూ నిర్వహించి ఆస్పత్రిల వారీగా నివేదికలు తీసుకుంటున్నారు. విధి నిర్వహణలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే వెంటనే చర్యలు చేపడుతున్నారు. దీంతో ప్రభుత్వాస్పత్రుల పనితీరు గణనీయంగా మెరుగుపడింది. వైద్యసేవలపై ప్రజలు సైతం సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా ఓపీల సంఖ్య అనూహ్యంగా పెరుగుతోంది.

**సేవలకు ర్యాంకులు**

ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న ఆస్పత్రులకు ప్రభుత్వం ప్రోత్సాహక ర్యాంకులను ప్రకటించింది. ఉమ్మడి జిల్లాకు 11 ఏ గ్రేడ్‌లు, 10 బీ గ్రేడ్‌లు వచ్చాయి. ఇక వరసగా ఆరు ర్యాంకులు జిల్లాకే వరించాయి. మదనపల్లె జిల్లా ఆస్పత్రికి 1వర్యాంకు, చిత్తూరు జిల్లా ఆస్పత్రికి 2 వర్యాంకు, శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి 3వ ర్యాంకు, పలమనేరు ఏరియా ఆస్పత్రికి 4వ ర్యాంకు, నగరి ఏరియా ఆస్పత్రి 5వ ర్యాంకు, కుప్పం 6వ ర్యాంకు వచ్చింది.

**సమష్టి కృషితోనే సాధ్యమైంది**



ప్రభుత్వం వైద్యరంగంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. అన్ని రకాల వైద్యసేవలను అందించేందుకు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆస్పత్రులకు జనం తాకిడి పెరిగింది. ఆరోగ్య శ్రీ సేవలు కూడా ఇందుకు సహకరిస్తున్నాయి. సమష్టి కృషి వల్లే ఇప్పుడు మంచి పేరు రావడం సాధ్యమైంది. మరింత మెరుగైన సేవలందించేందుకు చర్యలు తీసుకుంటాం.

– బీఎస్‌కే నాయక్, డీసీహెచ్‌ఎస్, చిత్తూరు

**అవసరాల మేరకు సిబ్బంది**



ప్రభుత్వం అన్ని వైద్యసేవలకు స్పెషలిస్ట్‌ల పోస్టులను భర్తీ చేసింది. ఫలితంగా అన్ని ఆసుపత్రుల్లో నిపుణుల సేవలు మెరుగుపడ్డాయి. అవసరాల మేరకు సిబ్బందిని నియమించింది. ఆరోగ్యశ్రీలో కారణంగా వేలాది మంది వస్తున్నారు. మెరుగైన వైద్యసేవలు అందిస్తుండడంతో సురక్షితంగా ఇంటికి చేరుతున్నారు.

– ఎం ప్రభావతి, ఇన్‌చార్జి డీసీహెచ్‌ఎస్, తిరుపతి

# మహిళల అభ్యున్నతే లక్ష్యం

- గత సర్కారులో ఇన్ని కోట్లు ఖర్చు చేశారా ..?
- జిల్లా స్థాయిలో వైఎస్సార్ ఆసరా మూడో విడత కార్యక్రమం
- 3,10,327 మంది మహిళల ఖాతాల్లో రూ.324.28 కోట్లు
- మెగా చెక్కును ఆవిష్కరించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- పాల్గొన్న ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, కలెక్టర్ హరి నారాయణన్



మూడో విడత వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ రెడ్డెప్ప



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : మహిళల అభ్యున్నతే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, గత సర్కారులో మహిళల అభివృద్ధికి ఇన్ని కోట్లు ఖర్చు చేశారా అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో వైఎస్రార్ ఆసరా మూడో విడత కార్యక్రమం పండుగ వాతావరణంలో జరిగింది. జిల్లా నలుమూలల నుంచి మహిళలు అధిక సంఖ్యలో విచ్చేసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన హామీలు, మేనిఫెస్టో హామీలను తమ ప్రభుత్వం 98.44 శాతం అమలు చేసిందన్నారు. చంద్రబాబు నాయుడు 600 హామీలు ఇస్తే అందులో ఏ ఒక్కటి కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదని, అందుకే ఆన్‌లైన్‌లో మేనిఫెస్టోను తొలగించారని ఆరోపించారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పథకాలకు మహిళల ఖాతాల్లో తమ ప్రభుత్వం రూ.2,25, 330. 76 కోట్లను జమ చేసినట్లు వెల్లడించారు. కరోనా సమయంలోనూ సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజలను ఆదుకున్నట్లు తెలిపారు.తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని పేర్కొన్నారు.

**మహిళలకు వరం**

ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ ఆసరా పథకం మహిళలకు వరంలాంటిదని చెప్పారు. చంద్రబాబు తన పాలనలో మహిళలకు చేసిందేమి లేదని ఎద్దేవ చేశారు. డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని చంద్రబాబు మోసం చేశారని ఆరోపించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళల పక్షపాతి అని అన్నారు. నగర మేయర్ అముద మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అండగా పలు పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు.

**రూ.324.27 కోట్లు జమ**

కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా పథకం కింద 3 విడతలో జిల్లాలో 3,10,327 మంది లబ్ధిదారులకు రూ.324.27 కోట్లు ప్రభుత్వం జమ చేసిందన్నారు. అనంతరం మూడో విడత చెక్కును ఆవిష్కరించారు. మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ సురేష్, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానంద రెడ్డి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ స్టేట్ కౌన్సిల్ మెంబర్ విశ్వనాథ్, పలమనేరు – కుప్పం– మదనపల్లె అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ వెంకట్ రెడ్డి యాదవ్, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, డీఆర్వో రాజశేఖర్, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ తులసి, మెప్మా పీడీ రాధమ్మ పాల్గొన్నారు.

**అక్క చెల్లెమ్మలకు బాసట**



మాది చిత్తూరు రూరల్ మండలం నాయని చెరువు. నా పేరు లోకేశ్వరి. మాది వీరాంజనేయ స్వయం సహాయక సంఘం. మూడో విడత వై స్సార్ ఆసరా కింద మా సంఘానికి 1, 20,000 అందగా, నా వంతుగా రూ.12 వేల లబ్ధి అందింది. మూడు దఫాల్లో రూ.36 వేలు లబ్ధి పొందా. సంఘంలో రుణం, ఆస రా ద్వారా మూడు ఆవులు కొని పాల వ్యా పారం చేస్తూ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలుస్తున్నా. రాష్ట్ర ముఖ్యమంత్రి అక్క చెల్లెమ్మలకు అందిస్తున్న బాసటను మరువలేం

**సాధికారతకు నిజమైన అర్థం**



నా పేరు షరీఫ్ తాజ్, నేను చిత్తూరు 26వ వార్డులో బాలాజీ సమాఖ్య మొదటి లీడర్‌గా ఉన్నా. ఇచ్చిన మాటకు కట్టుబడి మహిళా సాధికారతకు నిజమైన అర్థం చెబుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మహిళలకు అండగా నిలుస్తున్నారు. మా సంఘానికి 1,56,000 లబ్ధి చేకూరగా, నా వంతుగా 17వేలు ప్రతి దఫా లబ్ధి పొందుతున్నా. ఈ లబ్ధితో చీరల వ్యాపారాన్ని అభివృద్ధి చేశా. జగనన్న ఇస్తున్న సాయానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం.

### బిల్లుల నమోదు వేగవంతం

చిత్తూరు రూరల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో పెండింగ్‌లో ఉన్న బిల్లుల నమోదు ప్రక్రియ చర్యలు వేగవంతం అయ్యాయి. శనివారం రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందిన ఆదేశాల మేరకు జిల్లా అధికారులు రెండు రోజుల్లోపు పూర్తి చేసేందుకు కసరత్తు ప్రారంభించారు. కోవిడ్ వేతనాలకు సంబంధించి రూ.16.14 కోట్లు, నిర్వహణ కేంద్రాల బిల్లులు రూ. 37.44 కోట్ల వరకు ఆన్‌లైన్ చేశారు.

### పెండింగ్ బిల్లులపై ప్రత్యేక దృష్టి

చిత్తూరు కార్పొరేషన్: ఈనెల 31లోపు ప్రభుత్వ బకాయిలు వసూలు చేయాలని అధికారులను ట్రాన్స్‌కో రెవెన్యూ ఇంటర్నల్ ఆడిట్ సీజీఎం ధర్మజ్ఞాని ఆదేశించారు. శనివారంఆయన అర్బన్, రూరల్ ఈఈ కార్యాలయాలతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఈనెలలో ప్రభుత్వశాఖలకు బడ్జెట్ కేటాయింపులు జరు గుతుందని, పెండింగ్ కరెంటు బిల్లులు వసూలు అయ్యేలా చూడాలన్నారు.

## నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

తిరుపతి రూరల్: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీలు, మండల, పంచాయతీ పరిధిల్లోని అన్ని విద్యుత్ బిల్లుల కౌంటర్లలో ఆదివారం కూడా బిల్లులు చెల్లించవచ్చని ట్రాన్స్‌కో చిత్తూరు, తిరుపతి జిల్లాల పర్యవేక్షక ఇంజినీర్ కృష్ణారెడ్డి తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు.



# ఇల్లు అలకగానే పండుగ కాదు

- చంద్రబాబునాయుడు ఊహల్లో తేలుతున్నారు
- ప్రజల కష్టాలు తెలిసిన ఏకైక నాయకుడు జగన్
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి


మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : ఇల్లు అలకగానే పండుగ కాదు అనే సామెత ఉంది.. పొరబాటున రెండు, మూడు ఎమ్మెల్సీ స్థానాలు గెలవగానే అధికారంలోకి వచ్చేసినట్లు చంద్రబాబు కలలు కంటున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎద్దేవా చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా విచ్చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు ఊహల్లో తేలుతున్నారని చెప్పారు. నవంబర్‌లో ఎన్నికలు వస్తాయనుకుంటున్న బాబు ఊహలు సాధ్యమయ్యే పనికాదన్నారు. ఎప్పుడైనా పార్లమెంట్ ఎన్నికలతో పాటే అసెంబ్లీ ఎన్నికలు కూడా ఉంటాయని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ బలాన్ని ప్రదర్శించుకోవచ్చన్నారు. వైఎస్సార్‌సీపీ రాబోయే ఎన్నికలపై ధీమాగా ఉన్నట్లు తెలిపారు. తమ పార్టీకి 150 కంటే ఎక్కువ స్థానాలు వస్తాయన్నది తన వ్యక్తిగత అభిప్రాయమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుట్టుకతోనే భయంలేదని చెప్పారు. పచ్చపార్టీ, ఎల్లో మీడియా చేస్తున్న పుకార్లలో ఏ మాత్రం వాస్తవం లేదని స్పష్టం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా రాజకీయాల్లో ఇంతవరకు ఏ నాయకుడు పాదయాత్ర చేసి ప్రజల కష్టాలను తెలుసుకోలేదన్నారు. ప్రజా సంకల్ప యాత్రలో 3,648 కిలోమీటర్ల దూరం నడచి కోట్లాది మంది ప్రజల కష్టనష్టాలను తెలుసుకున్న ఏకైక నాయకుడు వైఎస్ జగన్ ఒక్కరే అన్న విషయాన్ని ప్రతిపక్షాలు గుర్తుపెట్టుకోవాలని మంత్రి పేర్కొన్నారు. చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

## మేథో సంపత్తి హక్కులపై అవగాహన


జడ్జి కరుణకుమార్‌ను సన్మానిస్తున్న అధ్యాపక బృందం

చిత్తూరు కలెక్టరేట్ : మేథో సంపత్తి హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కరుణ కుమార్ అన్నారు. నగరంలోని సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో రెండు రోజుల జాతీయ సదస్సు శనివారం ముగిసింది. జడ్జి మాట్లాడుతూ సాహిత్యం, వ్యాపార రంగం, వాణిజ్యరంగాల్లో హక్కుల ఉల్లంఘన జరిగితే ఏ విధంగా స్పందించాలో తెలిపారు. ప్రిన్సిపల్ మనోహర్, కో ఆర్డినేటర్ ఉషశ్రీ, అధ్యాపకులు ఉషారాణి, తిరుకుమరన్, రుక్మిణి, రమాదేవి, కిరణ్మయి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.




బంగారం :

| | |
|---|---|
| 24 క్యారెట్లు 10 గ్రాములు | రూ.55,500 |
| 22 క్యారెట్లు ఒక గ్రాము | రూ.5,400 |

వెండి:

| | |
|---|---|
| హోల్‌సేల్ ధర (కిలో) | రూ.70,000 |
| రిటైల్ వెండి గ్రాము | రూ.72.00 |

| | గరిష్టం | కనిష్టం |
|---|---|---|
| చిత్తూరు | 35 | 24 |
| తిరుపతి | 36 | 24 |
| తిరుమల | 31 | 21 |
| గూడూరు | 36 | 26 |
| నగరి | 36 | 25 |

## హత్య కేసులో నిందితుడి అరెస్ట్


వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

గూడూరు : పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఈ నెల 21వ తేదీన జరిగిన కామేష్ (25)అనే యువకుడి హత్యకేసులో నిందితుడిని శనివారం అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. రేణిగుంటలోని చిన్నమసీదు ప్రాంతానికి చెందిన నిందితుడు వింగవాపం జోగేంద్ర అలియాస్ జోగి గతంలో గూడూరు వచ్చి మజ్జిగ విక్రయించేవాడన్నారు. వైట్‌నర్‌కు బానిసగా మారిన జోగి ప్రస్తుతం భిక్షాటన చేసుకుంటున్నాడని తెలిపారు. ఈ క్రమంలో జోగేంద్ర మత్తులో ఉండగా స్థానిక బొగ్గులదిబ్బకు చెందిన కామేష్ గొడవపడ్డాడన్నారు. దీంతో ఆగ్రహించిన జోగి బండరాయితో కామేష్‌పై దాడి చేసి, పక్కనే ఉన్న సిమెంట్ దిమ్మెతో గుర్తుపట్టలేని విధంగా తలను చితక్కొట్టి చంపేసి పరారైనట్లు వెల్లడించారు. సీఐ హజరత్‌బాబు, ఎస్‌ఐ పవన్‌కుమార్ కేసు దర్యాప్తు చేసి నిందితుడు రైల్వే పార్శిల్ కార్యాలయం వద్ద ఉండగా అరెస్ట్ చేసినట్లు వివరించారు.

# ఈతకు వెళ్లి బీటెక్ విద్యార్థి మృతి

- పురాతన బావిలో మునక
- వార్డెన్‌కు తెలియకుండా గేటు దూకి వెళ్లిన ఐదుగురు విద్యార్థులు
- గంగవరం మండలంలో ఘటన


బాలాజీ మృతదేహం


బాలాజీ (ఫైల్)

పలమనేరు: ఈతకు వెళ్లి బీటెక్ విద్యార్థి మృతి చెందిన సంఘటన పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలం మేలుమాయి సమీపంలో శనివారం విషాదం నింపింది. వివరాలిలా..తవణంపల్లె మండలం తడకర గ్రామానికి చెందిన రమేష్, జ్యోతి కుమారుడు బాలాజీ(20) గంగవరం మండలంలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతూ, అక్కడి హాస్టల్ ఉంటున్నాడు. శనివారం మధ్యాహ్నం స్నేహితులు కేశవ, రవి, కిశోర్, జ్యోతితో కలసి ఈత కోసం కళాశాల ప్రాంగణంలో వెనుక వైపు ప్రహరీగోడను దూకి అక్కడికి సమీపంలో నిరుపయోగమైన పాత బావి వద్దకు వెళ్లారు. అందరూ బావిలో ఈత కొడుతున్నారు. కాసేపటి తర్వాత బాలాజీపైకి రాకపోవడంతో స్నేహితులు అతని కోసం నీటిలోకి వెళ్లి కాపాడేందుకు ప్రయత్నించారు. ఆపై భయంతో ఒడ్డుకు చేరి గంగవరం పోలీసులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది బాలాజీ మృతదేహాన్ని వెలికి తీశారు. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాలాజీ మరణానికి బావిలోని పాచి లాంటిది కాళ్లకు చుట్టుకుందా లేక ఇంకేమైనా కారణమా అనే విషయాలపై పోలీసుల విచారిస్తున్నారు. కొడుకు మృతిచెందాడనే వార్తతో విద్యార్థి తల్లిదండ్రులు ఆస్పత్రి వద్దకు చేరుకుని కన్నీరుమున్నీరుగా రోదించారు. హాస్టల్లోని విద్యార్థులు వార్డెన్ తెలియకుండా ఎలా ఈత కెళ్లారని, వార్డెన్ నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు.

## వాచ్ బుక్ చేస్తే రాయి వచ్చింది



కొరియర్‌లో వచ్చిన పార్శిల్, వాచ్‌కు బదులు వచ్చిన రాయి

గుడిపాల: మీ షో యాప్‌లో ఆన్‌లైన్‌లో వాచ్ బుక్‌చేస్తే రాయి వచ్చింది. వివరాలు ఇలా.. మండలంలోని 189 కొత్తపల్లెకు చెందిన సుభాష్ మీ షో యాప్‌లో రూ.1,232 రేటు వాచ్‌ని బుక్ చేశాడు. శనివారం కొరియర్ వచ్చింది. అతను దాన్ని విప్పి చూడగా ఓ రాయి ఉంది. వెంటనే మీ షో కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయగా 'మేము రెక్టిపై చేస్తాం.. 48 గంటల టైం కావాలని ఫోన్ పెట్టారు' రెండు రోజులు వేచి చూసి సమాధానం రాకుంటే ఫోరంలో ఫిర్యాదు చేస్తానని బాధితుడు తెలిపాడు.



## రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు మృతి


మృతి చెందిన హరి

వి.కోట: మండలంలోని యాలకల్లు బండపల్లి క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. శనివారం ఈ విషయం వెలుగులోకి వచ్చింది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని యాలకల్లు బండపల్లి క్రాస్ వద్ద రోడ్డు పక్కన ఒక్క వ్యక్తి తీవ్ర గాయాలతో కింద పడి ఉండగా శనివారం ఉదయం పొలాల వద్దకు వెళుతున్న రైతులు గుర్తించారు. పక్కనే మోటార్ సైకిల్ కింద పడి ఉంది. రైతులు 108కి సమాచారం ఇచ్చారు. 108 వాహన సిబ్బంది అక్కడికి చేరుకుని అతన్ని పరీక్షించారు. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. లభించిన ఆధారాల మేరకు మండలంలోని బండపల్లెకు చెందిన హరి(35)గా గుర్తించారు. విషయాన్ని పోలీసులకు, హరికుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. పోలీసులు విచారణ చేస్తున్నారు. చీకట్లో చెట్టును కొనడంతో ప్రమాదం జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు.

## మద్యం స్వాధీనం : ఒకరి అరెస్ట్

చిత్తూరు అర్బన్: బంగారుపాళ్యం మండలం టేకుమందలో శనివారం ఎస్‌ఈబీ అధికారులు దాడులు నిర్వహించి కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. బలిజపల్లికి చెందిన చందు మహేష్ (28) అనే వ్యక్తి వద్ద కర్ణాటక మద్యం 41 ప్యాకెట్లు పట్టుపడ్డాయి. అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ మోహన్‌బాబు, సిబ్బంది కృష్ణయ్య, నాగరాజ, సుబ్రమణ్యం గౌడు తదితరులు పాల్గొన్నారు.